క్లుప్తంగా

150 మందికి నేత్ర వైద్య పరీక్షలు



నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి (పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కృష్ణానదీ తీరంలోని పుష్కరఘాట్ ఫుడ్ కోర్టు భవనం ఆవరణలో జరిగిన శిబిరంలో 150 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 105 మందిని ఐఓఎల్ ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరిని మే ఒకటో తేదీన ఆస్పత్రికి తీసుకువెళ్లి శస్త్రచికిత్స చేయిస్తామని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ తెలిపారు. డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సోనాలి నేత్ర పరీక్షలు చేశారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని ప్రైవేటు విద్యా సంస్థల స్థితిగతులను పూర్తిగా తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా సంస్థల రెన్యువల్ సమయాన్ని మూడు నుంచి ఎనిమిది సంవత్సరాలకు పెంచుతూ శనివారం జీఓ ఎంఎస్ నెంబర్ 38 జారీ చేయడంపై ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు టి. సుందరరామ్, రాష్ట్ర అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. జనార్దనరావు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి పనులు ప్రారంభం



కె. కొత్తపాలెం(మోపిదేవి): కె. కొత్తపాలెంలో జాతీయ గ్రామీణ ఉపాధి పనులు శనివారం సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి ప్రారంభించారు. మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, సచివాలయ కన్వీనర్ మత్తి వెంకట విశ్వేశ్వరరావు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

పెదశింగు లక్ష్మణరావుకు నివాళి



మచిలీపట్నంటౌన్: మాజీ మంత్రి పెదశింగు లక్ష్మణరావు వర్ధంతి కార్యక్రమం కోనేరుసెంటర్‌లోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. లక్ష్మణరావు విగ్రహానికి మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ బలగం విజయశేఖర్, లక్ష్మణరావు కుమారుడు వెంకటేశ్వరరావు, పెదశింగు తులసీరాజన్, ద్వారకానాథ్, కోడూరు కోట కృష్ణమోహన్, చిలకలపూడి భక్తాంజనేయులు, అంకాని శేషుబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత రామానాయుడుపేట సెంటర్ నుంచి కోనేరు సెంటర్‌లోని లక్ష్మణరావు విగ్రహం వరకు ఆయన చిత్రపటాన్ని ఊరేగించారు. పెదశింగు లక్ష్మణరావు సేవలను పలువురు కొనియాడారు.

సర్పంచ్ ఉమాకు ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ

వక్కలగడ్డ(చల్లపల్లి): వక్కలగడ్డ సర్పంచ్ వల్లూరు ఉమాను శనివారం అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పరామర్శించారు. ఉమా తల్లి వీరమాచనేని సీతారావమ్మ ఇటీవల మృతిచెందగా ఎమ్మెల్యే రమేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు ఉమాను పరామర్శించారు. అనంతరం నరసింహారావు చల్లపల్లిలో పలువురిని పరామర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గోవాడ రాము ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా పరామర్శించారు. పార్టీ నాయకులు ఏసుపాదం ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామ ప్రముఖులు పరమేశ్వరరావు కుమార్తె ఇటీవల మృతి చెందగా వారిని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

12 నెలలకు జీతాలు చెల్లించాలని వినతి

చిలకలపూడి (మచిలీపట్నం): డీఎస్సీ-2008 ఎంటీఎస్ ఎస్జీటీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న తమకు 12 నెలలకు జీతాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వెలుగు టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ పి.పాపారావు విజ్ఞప్తి చేశారు. 'జగనన్నకు చెప్పుకుందాం' కార్యక్రమం ద్వారా కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. పాపారావు మాట్లాడుతూ విద్యాశాఖలో పని చేస్తున్న తమకు 10 నెలలు మాత్రమే వేతనం ఇస్తున్నారని, అలా కాకుండా కాంట్రాక్టు ఉద్యోగుల మాదిరిగా 12 నెలలకు వేతనం చెల్లించాలని కోరారు. ఫెడరేషన్ నాయకులు తిరుపతిరావు, ఆర్. వీరాంజనేయులు, మహాలక్ష్మీ, రమణయ్య, భిక్షాలరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి జోగి రమేష్
- ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు

పెడన: రంజాన్ వేడుకలను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెడన, మచిలీపట్నం, అవనిగడ్డ నియోజకవర్గాల్లో ముస్లింలు తెల్లవారు జామునుంచే మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

పెడన పట్టణం గుడివాడ రోడ్డులోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, తనయుడు జోగి రాజీవ్ చిన్నముతా ప్రార్థన మందిరం వద్దకు వెళ్లి ముస్లింలను, మత పెద్దలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెద్ద ముతా ఈద్గా ఈద్ ఉల్ పితర్ నమాజ్‌లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లికార్జునరావు, కౌన్సిలర్లు గంగయ్య, గోపి, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, నాయకులు, మత పెద్దలు పాల్గొన్నారు.



పెడన ప్రార్థనలో పాల్గొన్న మంత్రి జోగి రమేష్ తదితరులు

నాగాయలంకలో..

నాగాయలంక: స్థానిక కృష్ణానది తీరంలోని జుమా మసీదులో ముస్లింలు శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదు ఇమామ్ అబ్దుల్ సత్తార్ మహ్మద్ ప్రవక్త సందేశాలను తెలిపారు. రంజాన్ ప్రాముఖ్యతను వివరించారు. గ్రామానికి చెందిన ముస్లింలు మసీదుకు వచ్చి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల పరిషత్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు, కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

బంటుమిల్లిలో..

బంటుమిల్లి: స్థానిక ఖాదిర్ జామియా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు జరిగాయి. మత గురువు ముజఫర్ హుస్సేన్ పర్యవేక్షణలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. బంటుమిల్లి, పెదతుమ్మిడి, జానకిరామపురం గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పేదలకు దానాలు చేశారు. ఎంపీపీ వి. చినబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు సుజ్ఞానం బ్రదర్స్, పి. బాబూరావు, ఎం. రాజబాబు తదితరులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నగురువు జమేదార్, మసీద్ కమిటీ సభ్యులు, ఎంపీటీసీలు ఎండి. కమాల్‌బాషా, అబ్దుల్ ఆలీం, ఎండీ బాబ్జీ, ఎండీ నజీర్, ఎండీ అక్బర్, మాజీ సర్పంచ్ ఎండీ అమీర్, సాధిక్, బాజానీ, బాబ్జీ, బాషీ, సత్తార్ తదితరులు పాల్గొన్నారు. మల్లేశ్వరం గ్రామంలోని మసీద్‌లో మత గురువు అహ్మద్ పర్యవేక్షణలో రంజాన్ ప్రార్థనలు జరిగాయి.

గూడూరులో..

గూడూరు: రంజాన్ పర్వదినాన్ని గూడూరు మండలంలో ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గూడూరు ఈద్గాలో మత గురువు హాఫిజ్ షోయబ్ మహ్మద్ ఆధ్వర్యంలో ఈద్ నమాజులు జరిగాయి. అనంతరం ఖుత్బా ప్రసంగం నిర్వహించారు. ఈద్‌గాకు వచ్చిన గ్రామ సర్పంచి లింగం సులోచనారాణి ముస్లింలకు ఈద్ శుభాకాంక్షలు చెప్పి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆకులమన్నాడు, మల్లవోలు, పినగూడూరులంక, తరకటూరు, పోలవరం, షా అబ్దుల్లాపాలెం, పటాన్‌పేట తదితర ప్రాంతాల్లో రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.

కోడూరులో..

కోడూరు: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని చినగుడుమోటు మసీదులో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించి, ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్-ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నపెద్దా తేడా లేకుండా ముస్లింలంతా ప్రార్థనల్లో పాల్గొనగా, ప్రతి ఇంటా పండుగ శోభ ఉట్టిపడింది. పెదగుడుమోటు, కోడూరు, నరసింహపురం మసీదుల్లో రంజాన్ ప్రార్థనలు జరిగాయి.

అవనిగడ్డ, ఘంటసాలలో..

అవనిగడ్డ: స్థానిక జామియా మసీదులో ఇమామ్ ఎండీ షాహజాద్ ఈద్ ఉల్ ఫితర్ ప్రార్థన చేశారు. మసీదు అభివృద్ధి కమిటీ చైర్మన్ అబ్దుల్ రెహమాన్ పర్యవేక్షణలో మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. ఘంటసాలలో మహమ్మద్ యాకుబ్ పాషా ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజ్ జరిగింది. పలు ప్రాంతాలకు చెందిన ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. అహ్మదీయ ముస్లిం జమాత్ జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసీం, జాకీర్ హుస్సేన్, అక్బర్, నూర్జాతో పాటు పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్ ఫితర్

చల్లపల్లి: ముస్లింలు ఈదు ఉల్ ఫితర్ పర్వదిన వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక మహమ్మదీయ మస్జీదు, నారాయణరావు నగర్ గౌసియా మస్జీదుల నుంచి ముస్లింలు ర్యాలీగా ట్రావెలర్స్ బంగ్లా వెనుక ఉన్న ఈద్గా మైదానం వద్దకు చేరుకున్నారు. నారే తక్బీర్ అల్లాహు అక్బర్ నినాదాలు చేస్తూ సందడి చేశారు. ప్రవక్తలు చూపిన సన్మార్గంలో పయనిస్తామంటూ నినదించారు. ఈద్గా మైదానంలో మత గురువు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రవక్తల త్యాగాలు, ఖ్యాతి గురించి వివరించారు. ఫిత్రా దానం, జకాత్ దానం ప్రాధాన్యత వివరించారు. అనంతరం ముస్లింలు పరసర్పం ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



చల్లపల్లిలో ప్రసంగిస్తున్న మత గురువు



గూడూరులో ఈద్గావద్ద మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసిన సర్పంచ్ సులోచనా రాణి



అవనిగడ్డలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

రంజాన్ ప్రార్థనల్లో ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: ఇనుగుదురుపేటలోని జామియా మసీదులో జరిగిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మసీదు వద్ద యాచకులకు దానం చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సలార్‌దాదా కోడలు, కార్పొరేటర్ షేక్ షాహీనా, కుమారులు షేక్ మొహమ్మద్ సాహెబ్, హాషిం, ముబారక్ తదితరులకు శుభాకాంక్షలు తెలిపారు. సలార్‌దాదా పేర్ని నాని, పేర్ని కిట్టులను సత్కరించారు. సలార్‌దాదాకు మేయర్ వెంకటేశ్వరమ్మ, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, కార్పొరేటర్ మేకల సుబ్బన్న, కో-ఆప్షన్ సభ్యుడు తుమ్మలపల్లి జగన్నాథం శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ జిల్లా కన్వీనర్ ఖరార్ మూసవికి పేర్ని నాని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే పేర్ని నానిని సత్కరిస్తున్న సలార్‌దాదా



మచిలీపట్నం ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, చిత్రంలో పేర్ని కిట్టు, సలార్‌దాదా

మచిలీపట్నంలో..

మచిలీపట్నంటౌన్: ముస్తాఖాన్‌పేటలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. ప్రభుత్వ ఖాజీ మొహమ్మద్ హుస్సేన్ పర్యవేక్షణలో మౌలానా మొహమ్మద్ వాజిద్ హుస్సేన్ ప్రార్థనలు నిర్వహించి రంజాన్ విశిష్టతను వివరించారు. నగరం నలుమూలల నుంచి ముస్లింలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఈద్గా ప్రాంతం కిక్కిరిసింది. నగరంలోని పలు మసీదుల్లో రంజాన్ ప్రార్థనలు జరిగాయి. ఈద్గా వద్ద ప్రార్థనల్లో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), షేక్ సలార్‌దాదా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఈద్గా మైదానం మెరక చేసేందుకు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) 50 ట్రక్కులతో మట్టి వేయించారని చెప్పారు. ఈద్గా వద్ద ప్రార్థనల్లో వైఎస్సార్ సీపీ నాయకులు మాదివాడ రాము, మొహసిన్, షేక్ రబ్బానీ, ఖాలిద్, బాజీ, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ మతీన్ తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు పూలే జీవితం ఆదర్శం

విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: భావితరాలకు మహాత్మా జ్యోతిరావుపూలే జీవితం ఆదర్శనీయమని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. ఎల్ఐసీ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పూలే విగ్రహాన్ని పేర్ని నాని శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పూలే సేవలను వివరించారు. యువత ఆయన బాటలో పయనించాలన్నారు. పూలే మార్గంలో పయనించే ప్రతి ఒక్కరు దేశానికి ఉపయోగపడేలా మారతారన్నారు. ఎల్ఐసీ ఓబీసీ ఉద్యోగులు పూలేపై విశ్వాసాన్ని, అభిమానాన్ని చాటుకుంటూ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పట్టంశెట్టి సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి ధూళిపూడి శ్రీనివాసరావు, కరగ్రహారం మాజీ సర్పంచ్ నడకుదుటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిరావుపూలే విగ్రహాన్ని ఆవిష్కరించిన పేర్ని నాని

ఆకట్టుకున్న అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటకం

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ముస్తాఖాన్‌పేటలో శనివారం రాత్రి ఏర్పాటుచేసిన సంఘం శరణం గచ్ఛామి అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ (జగ్గరాజు) బృందం కళాకారులు ప్రదర్శించిన ఈ నాటకం అంబేడ్కర్ జీవిత విశేషాలను వివరిస్తూ సాగింది. నాటకంలోని పలు ఘట్టాలు అంబేడ్కర్ జీవితానికి అద్దం పట్టాయి. దళిత సంఘ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి నాటకాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ మాట్లాడుతూ సమసమాజ నిర్మాణానికి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంతగానో కృషి చేశారని చెప్పారు. భారత రాజ్యాంగాన్ని ఆయన రాయబట్టే నేడు నిమ్నజాతి కులాలు తలెత్తుకుని జీవిస్తున్నాయన్నారు. అంబేడ్కర్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు (జానీ), కార్పొరేటర్లు ఏకశిరి వెంకటేశ్వరరావు, మీర్ అస్గర్‌అలీ, మాజీ కౌన్సిలర్లు చిటికిన నాగేశ్వరరావు, శీలం బాబ్జీ, వైఎస్సార్ సీపీ నాయకులు బూరగ రామారావు, దరిశె శ్రీరాం, గాజుల భగవాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విక్టర్‌ప్రసాద్

జనసేన నాయకులపై అట్రాసిటీ కేసు నమోదు

గూడూరు: గూడూరు మండలం ఆకుమర్రు గ్రామంలో గ్రామ సమైఖ్య అధ్యక్షురాలు కారుమంచి పరిమళ కుమారిని కులం పేరుతో దూషించి దాడికి పాల్పడిన జనసేన పార్టీ నాయకులపై గూడూరు పోలీసులు శనివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్ఐ వి. వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆకుమర్రు గ్రామంలో కైలా అర్చన బుక్‌కీపర్‌గా గతంలో డ్వాక్రా మహిళల నిధులు స్వాహా చేసింది. ఈ ఘటనపై పరిమళ కుమారి గ్రామ సమైఖ్య అధ్యక్షురాలు హోదాలో పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పట్లో కేసు నమోదు చేసి అర్చనను జైలుకు పంపించారు. ఆ సమయంలో అర్చనకు సాయం చేసిన జనసేన నాయకులు బత్తిన హరిరాం, సమ్మెట గణపతి, ముద్దినేని రామకృష్ణ శనివారం ఆకుమర్రు గ్రామానికి వచ్చి గతంలో కేసును మనస్సులో పెట్టుకుని పరిమళ కుమారిని కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడంతో పరారయ్యారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేసిన పోలీసులు నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

ధరిత్రీ దినోత్సవ ర్యాలీ

అవనిగడ్డ: ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వికాస తరంగిణి ఆధ్వర్యంలో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. భూమిని కాపాడుకుందాం, భూతాపం నుంచి రక్షిద్దాం అంటూ వికాస తరంగిణి సభ్యులు నినాదాలు చేశారు. చినజీయర్ స్వామి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహించామని నిర్వాహకులు బొప్పన పరమేశ్వరరావు తెలిపారు. ధరిత్రిని కాపాడు కోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని, లేదంటే మానవ జాతి ప్రమాదంలో పడే అవకాశం ఉందని చెప్పారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

ఎర్లీ కెరీర్ ట్రైనింగ్ ప్రోగ్రాంకు దరఖాస్తుల ఆహ్వానం

చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎర్లీ కెరీర్ ట్రైనింగ్ ప్రోగ్రాంకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ భాగస్వామ్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఇంటర్ అర్హతతో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం పొందే అద్భుత అవకాశమన్నారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాంకు సంబంధించి ఈ నెల 29వ తేదీన హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, గన్నవరం కార్యాలయంలో రాత, మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. అర్హత కలిగిన వారు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని, విద్యార్హతలతో పాటు 29వ తేదీన ఉదయం ఎనిమిది గంటలకు గన్నవరంలోని హెచ్‌సీఎల్ కంపెనీకి రావాలన్నారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాంకు సంబంధించి అభ్యర్థులు, తల్లిదండ్రులకు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కంపెనీ ప్రతినిధులతో ఈ నెల 26వ తేదీన ఉదయం 10 గంటలకు మచిలీపట్నంలోని పద్మావతి మహిళా డిగ్రీ హిందూ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్: 99664 89796, 94404 44033 నంబర్లను సంప్రదించాలన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

లాడ్జి యజమానులకు పోలీసుల హెచ్చరిక

కోనేరుసెంటర్: లాడ్జి యజమానులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లాలోని పోలీసు అధికారులు ఆదేశించారు. జిల్లా ఎస్పీ పి. జాషువా ఆదేశాల మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న లాడ్జి యజమానులతో పోలీసు అధికారులు సమావేశాలు నిర్వహించారు. లాడ్జిలో బస చేసే వ్యక్తుల పూర్తి వివరాలు తెలుసుకోనిదే గదులు ఇవ్వకూడదన్నారు. బస చేసే వారి వివరాలు తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని, గదిలో దిగే వ్యక్తుల ఫొటోలు తీసుకోవాలని, లాడ్జిల్లో ఖచ్చితంగా సీసీ కెమేరాలు అమర్చాలని, అనుమానాస్పద వ్యక్తులు లాడ్జిల్లో దిగినట్‌లైతే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందజేయాలని చెప్పారు. అతిథుల వివరాలను డాక్యుమెంటేషన్‌తో పాటు సంబంధిత ఎస్‌హెచ్‌ఓకు ప్రతి రోజు ఉదయం 7 గంటలకు అందజేయాలని ఆదేశించారు. లాడ్జిలు, హోటళ్ల తనఖీ చేసేందుకు వచ్చే పోలీసులకు యజమానులు సహకరించాలన్నారు. లాడ్జిలు, హోటళ్లను చట్ట వ్యతిరేక చర్యలకు ఉపయోగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అస్సలు తావీయకూడదన్నారు. సమావేశాల్లో ఆయా సబ్ డివిజన్ల పరిధిలోని ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

మోపిదేవి: మోపిదేవి నుంచి చల్లపల్లి వెళ్లే కొక్కిలిగడ్డ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మచిలీపట్నం నుంచి చెరుకుపల్లికి వివాహానికి వెళుతున్న కారు బైక్‌ను వెనుక నుంచి ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. తాడేపల్లికి చెందిన యువకులు మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి వచ్చి తిరిగి తాడేపల్లికి వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. బైక్ నడుపుతున్న బొడ్డు సాయికుమార్‌కు తీవ్ర గాయాలు కాగా, బైక్ వెనుక ఉన్న పొదిలి వెంకట శేషగిరికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను 108 వాహనంలో విజయవాడ ఆస్పత్రికి తరలించారు. మోపిదేవి ఎస్ఐ సీహెచ్ పద్మ ఘటనాస్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయికుమార్

గంగానమ్మ తల్లికి జలాభిషేకం

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో గంగానమ్మ తల్లి 12వ వార్షికోత్సవ జాతర శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు ప్రతి ఇంటి నుంచి ఒక్కొక్క బిందె నీళ్లు తీసుకుని వచ్చి జలాభిషేకం చేశారు. సకాలంలో వర్షాలు పడి రైతులు పాడి పంటలతో సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని కోరుకున్నారు. అనంతరం పోతురాజు గెడను గ్రామంలో ఊరేగించారు. గంగానమ్మ తల్లికి కొసరాజు వంశీయులు తొలి పూజ నిర్వహించారు.